# న్యాయస్థానాలలో న్యాయాన్ని హాస్యాస్పద స్థాయికి దిగజార్చిన పాలకులు

**హిందూ** మతతత్వశక్తులు సాగించిన అనేక హింసాత్మక కేసులలో ఇటీవల వెలువడిన అనేక తీర్పులను పరిశీలిస్తే, ఎన్‌డిఏ పాలకులు చాలా నైపుణ్యయుతంగా ప్రజలను మోసగిస్తున్నారని స్పష్టమౌతోంది. మానవత్వానికి, మానవజాతికీ వ్యతిరేకంగా వారు సాగించిన హీనమైన నేరాలను తమ ప్రభుత్వాధికారాన్ని ఉపయోగించి న్యాయ స్థానాలలో రద్దుచేయించుకోగలుగుతున్నారు. ఈ విధంగా న్యాయస్థానాలలో న్యాయాన్ని హాస్యాస్పద స్థాయికి దిగజార్చారు.

మాలెగావ్ పేలుళ్ళ కేసు(2008)లో ఒక సంవత్సరం క్రితం ఆ కేసులో ప్రధాన నిందితురాలైన స్వాధ్విప్రగ్యాసింగ్‌ను, మరో ఏడుగురు నిందితులను ఎన్నో సాక్ష్యాధారాలున్నప్పటికీ భోపాల్ జిల్లా న్యాయస్థానం కనీసం జరిమానా కూడా విధించకుండా వారిపై కేసును కొట్టివేసింది.

అజ్మీర్ దర్గా పేలుళ్ళ కేసు (2007), సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌పై దాడి(2007) కేసులలోనూ ఇలానే జరిగింది. హిందూమతతత్వ సంస్థలకు చెందిన వారే ఈ కేసులలోనూ నిందితులుగా వున్నారు.

2007 మే 18న జరిగిన హైదరాబాద్ మక్కా మసీదు బాంబు కేసులో 9 మంది చనిపోగా 58 మంది గాయపడ్డారు. స్వామీ అసీమానంద ఈ కేసులో ప్రధాన నిందితుడు. పైన పేర్కొన్న కేసుల లోనూ, వాటితో సంబంధమున్న అన్నింటిలో స్వామీ అసీమానంద నిందితుడే! అయితే ఈ కేసును కూడా కోర్టు ఇటీవల కొట్టివేసింది.

ఢిల్లీలోని ఓ న్యాయమూర్తి ఎదుట స్వామీ అసీమానంద తన నేరాన్ని అంగీకరిస్తూ ప్రకటించాడు. నేరాన్ని అంగీకరిస్తూ ఇచ్చిన ఒప్పుకోలు వాంగ్మూలంలో మరణశిక్షను తాను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్న అంశాన్ని ఓ నెల తర్వాత మరో న్యాయమూర్తి గుర్తుచేయగా, మక్కామసీదు బాంబు ప్రేలుళ్ళ కేసులోనూ, ఇతర కేసులలోనూ తన పాత్రను అతను అంగీకరించాడు. అయితే అసీమానంద తన ఒప్పుకోలును అంతిమంగా నిరాకరించటంతో, 'సాక్ష్యాల కొరత' కారణంతో జాతీయ దర్యాప్తుసంస్థ(ఎన్ఐఎ) కోర్టు న్యాయమూర్తి ఈ కేసులో అతను నిరోషిగా ప్రకటిస్తూ తీర్పు నిచ్చాడు. అయితే, ఈ తీర్పు వెలువరించిన వెను వెంటనే ఆ న్యాయమూర్తి తన పదవికి రాజీనామా చేశాడు. ఈ కేసులో నూతనంగా నియమించబడిన ప్రత్యేక న్యాయమూర్తికి క్రిమినల్ చట్టాలలో అనుభవం లేకపోగా, అతను రెండవ సంవత్సరం న్యాయ విద్యనభ్యసించే సమయంలో ఏబివిపి సభ్యునిగా వుండి, ఆవిధంగా బిజెపి, ఆర్ఎస్ఎస్, హిందూమతతత్వ సంస్థలతో సన్నిహిత సంబంధా లలోనున్న వాడుగా వున్నాడు. ఈ కేసును దర్యాప్తు చేసిన ఎన్ఐఏ-ప్రభుత్వాధికారంలో వున్న వారి కనుగుణంగా వ్యవహరించి, కేసును నీరుగార్చి, న్యాయాన్ని 'విజయవంతంగా' ఓడించగలిగింది.

పైన తీర్పు వెలువడిన ఓ పదిహేను రోజుల లోనే, ఏప్రిల్ 20న, ముస్లిములను ఊచకోత కోసిన నరదోదా పాటియా కేసు (2002)లో ముద్దాయిగావున్న నరేంద్రమోడీ ప్రభుత్వంలో మాయాకొదాని అనే మంత్రిపైనున్న కేసు కొట్టివేయ బడింది. 2002 దాడుల తర్వాత కొదాని మంత్రి పదవిని అధిష్టించింది. దాడులకు ఆమెను కీలకమైన సూత్రధారిగా నిర్ణయించి విచారణ న్యాయస్థానం ఆమెకు 28 సం॥ల కారాగార శిక్ష విధించింది. అప్పీల్ చేసుకోవటంతో ఈ శిక్షను హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పు చాలామందిని నిశ్చేష్టులను చేసింది. ఎందుకంటే ముస్లిములపై దాడుల సందర్భంగా ఈమె ప్రత్యక్షంగా పాల్గొనటాన్ని, ఆ మూకలకు కత్తులను అందించటాన్ని, పోలీసుల నుండి ఎలాంటి విచారణలూ వుండబోవని వారికి హామీఇవ్వటాన్ని అనేకమంది చూశారు. బిజెపి పాలకులకు అనుకూలంగా చాకచక్యంగా ఈ కేసు విచారణ సాగించి, దానిని కొట్టివేయించారనేది స్పష్టం.

మహారాష్ట్రలోని ఘటకాపూర్‌లో ఇద్దరిని హత్యగావించిన బాంబుపేలుడు కేసులో 2002 డిసెంబర్‌లో ముంబయి పోలీసులు ఖాజాయూనస్ అనే 27 సం॥ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను అరెస్టు చేశారు. పోలీసు బందోబస్తు నడుమనుండి ఔరంగాబాద్ తీసుకువెళు తుండగా ఇతను అదృశ్య మయ్యాడని పోలీసులు పేర్కొన్నారు. కానీ అతనిని పోలీసు నిర్భంధంలో వుండగానే హత్యగావించారు. ఈ కేసును దర్యాప్తు చేసిన సిఐడి కూడా పోలీసుల చిత్రహింసల కారణంగానే అతను చనిపోయాడని వెల్లడించింది. ఈ కేసు విచారణలో ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాదిగా 2015 నవంబర్‌లో నియమింప బడిన ధీరజ్ మిరాస్కర్‌ను ఏప్రిల్ 17న ఆ పదవి నుండి మహారాష్ట్ర ప్రభుత్వం అకస్మాత్తుగా తొలగించింది. ఖాజాయూనస్ కేసులో అతనిని చిత్రహింసలకు గురిచేసి హత్యచేసిన నలుగురు పోలీసు అధికారులను అదనంగా ముద్దాయిల జాబితాలో చేర్చవలసిందిగా ధీరజ్ మిరాస్కర్ న్యాయస్థానాన్ని అడగటమే, అతన్ని పదవినుండి తొలగించటానికి కారణమైంది. మహారాష్ట్ర ప్రభుత్వం నేరవిచారణ విభాగంలో నిష్టాతులైన, సమర్ధులైన పోలీసు అధికారులను వినియోగించటానికి సిద్ధంగా లేకపోవటంతో, తాను ప్రత్యేకించి నియమించిన ప్రభుత్వ న్యాయవాది ద్వారానే న్యాయం ఓడించబడింది.

గోధ్రా హత్యాకాండ కేసులో ముద్దాయిగా నున్న బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాను రక్షించే క్రమం ఇదేనని ప్రత్యర్ధి పార్టీలు ఆరోపణలు చేస్తుండగా, జస్టిస్ లోయా హత్యకు గురయ్యాడు.

ముజఫర్‌నగర్ కేసులో ప్రధాన ముద్దాయి లపై కేసును కొట్టివేయించటంద్వారా మంత్రి– సురేష్‌రానా, మాజీ కేంద్రమంత్రి–సంజీవ్ బాలయాన్, ఎం.పి.–భర్తేంద్‌సింగ్, ఎంఎల్ఏ–ఉమామహేష్‌లను ఈ కేసునుండి రక్షించటానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం భూమికను ఈపాటికే తయారుచేసింది.

దర్యాప్తు సంస్థల బలహీనవాదనలు, అసమర్ధ, నిష్ఫల విచారణల కారణంగానే సాంకేతికంగా ఈ కేసులన్నీ వీగిపోయినట్లుగా కనిపించినప్పటికీ, వాస్తవానికి అధికారంలోనున్న పాలకులు సాగించిన మోసకారీతనం, న్యాయాన్ని, న్యాయస్ఫూర్తిని ఓడించే విధంగా తప్పుడు దిశానిర్దేశం ఫలితంగానే ఈ కేసులు విఫలమయ్యాయని స్పష్టమౌతుంది. అధికారంలోనున్న ప్రభుత్వాలు తమ కోర్కెలకు, ఆకాంక్షలకు అనుగుణంగా అదుపుచేయటానికి న్యాయవ్యవస్థ అనువుగా వుంది.

కనుక, చట్టం ముందు అందరూ సమానులే, అత్యున్నత న్యాయవ్యవస్థ, సమానన్యాయం, న్యాయ వ్యవస్థల స్వతంత్రల గురించి గొప్పగా చెప్పుకునే మాటల గురించి విశ్వసించాల్సింది ఏమాత్రం లేదు. గొప్పగా ధ్వనించే పదాడంబరాలతో ఎవరూ దానిపట్ల భ్రమలు కలిగి వుండాల్సిన అవసరంలేదు.

దోపిడీ పాలనావ్యవస్థలోని ఇతర పరిపాలనా విభాగాలు, శాఖల లాగానే న్యాయపాలన, న్యాయ వ్యవస్థకూడా ఇందులో ఒక భాగమే. ఈ పరిస్థితి ఆటోమాటిక్‌గా పాలకవర్గాల వారి ప్రతినిధుల చేతుల్లో న్యాయవ్యవస్థను ఒక కీలుబొమ్మగా మారుస్తోంది.

పైన పేర్కొన్న కేసుల విషయంలోనూ ఈ వాస్తవం మరోసారి నిర్ధారితమౌతోంది. ప్రజల ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పడనంతవరకూ నిజమైన న్యాయమనేది ఎండమావిగా, అంతు చిక్కనిదిగా మిగిలిపోతుంది.

ooooo